క్లుప్తంగా

హెల్త్ క్లినిక్ భవనం కోసం పరిశీలన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్వహణకు భవనం కోసం ఎంపీపీ షేక్ బాజీ శుక్రవారం పరిశీలన చేశారు. హెల్త్ క్లినిక్ నిర్మాణం కోసం రూ.18 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. చందోలు-1 సచివాలయ పరిధిలో హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు మరో రెండు నెలలు సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఈ లోపు కార్యకలాపాలకు భవనం కోసం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మునీర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పాణీ అభయ గౌరిగా బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసిన బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు శీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జ్యేష్ఠ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని పాణీ అభయ గౌరీగా అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

సప్లిమెంటరీకి 29 మంది గైర్హాజరు

చెరుకుపల్లి: పది సప్లిమెంటరీకి మొదటిరోజు రోజు 29 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు హెచ్‌ఎం పులి లాజర్ తెలిపారు. గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన తెలుగు పరీక్షకు 97మంది విద్యార్థులకు గాను 66మంది హాజరైనట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ పరీక్షకు అమృతలూరు, చెరుకుపల్లి మండలాల ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

4న లక్ష మల్లెపూల పూజ

రేపల్లె: జేష్ఠపౌర్ణమి పురస్కరించుకుని ఈ నెల 4న ఆదివారం గ్రామదేవత బూరుగులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు నందివెలుగు భాను సుధాకర్ గురుకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, 7 గంటలకు అన్నాభిషేకం, సాయంత్రం 6 గంటలకు లక్ష మల్లెపూల పూజ నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పేద మహిళలకు సాయం



కర్లపాలెం: ఆర్థిక సమస్యల్లో ఉన్న పేద మహిళలకు ప్రతి శుక్రవారం చేయూతనందిస్తున్నామని కర్లపాలెం ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా తెలిపారు. తోటి ముస్లింలతో కలసి కర్లపాలెం పంచాయతీ ఎంపీరాజుపాలెంలో ఆర్థిక సమస్యలతో ఉన్న గిరిజాంబకు రూ.5వేలు, మరొక ముస్లిం మహిళకు 10 కేజీల బియ్యం అందజేశారు. షేక్ వలీ, షేక్ సాబీర్, షేక్ హబీబ్, పఠాన్ గౌస్‌ఖాన్, షేక్ జిలానీ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



బాపట్ల: శ్రీ కృష్ణయాదవ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు బాపట్ల జిల్లా యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 4న గుంటూరు అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. 500 మార్కులకుపైగా వచ్చిన విద్యార్థులు హాజరుకావాలని సూచించారు. సమావేశంలో భావపురి విద్యా సంస్థల ప్రిన్సిపల్ ఆవుల వెంకటేశ్వర్లు, బోయిన శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి.. ప్రతి మహిళా ఆర్థిక వృద్ధి

- సంక్షేమ పథకాల వెలుగుల్లో పేద కుటుంబాలు
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



మహిళకు సంక్షేమ కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వరహాపురం(వేమూరు): పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జు అన్నారు. వరహాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి ఎంత చేకూరిందో వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి సాధించినట్లు వివరించారు. గత ప్రభుత్వాలు సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు మేలు చేయలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సుమారు లక్ష రూపాయలు ప్రతి మహిళకు లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, చందోలు డేవిడ్ విజయకుమార్, బొల్లిముంత ఏడుకొండలు, గాజుల భానుప్రకాశ్, దాది సుబ్బారావు, గాజుల మోహన్, దున్నా మేరీ సుబాబు, తలతోటి సువర్ణరావు, సజ్జా శ్రీనివాసరరావు, తోలతోటి ప్రదీప్, యల్లమాటి చంటి, యల్లమాటి భాస్కరరావు, అరమళ్ల సంధ్యారాణి, ఈపూరు ప్రసాద్, యల్లమాటి పరిశుద్ధరావు, గవాస్కర్, జ్యోతిబాబు, మధిరిరాజు, తురిమిళ్ల నాగార్జున, జ్యోతుల సాగర్, గాలి నాగేశ్వరరావు, ఎలిచర్ల దేవదానం, అలపర్తి రవి, దొప్పలపూడి జ్యోతిబాబు, గుమ్మడి దానియేలు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలి

కొల్లూరు సర్వసభ్య సమావేశంలో సభ్యుల వినతి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యనారాయణరావు

కొల్లూరు : గ్రామీణ ప్రాంతాలకు ఇటీవల ఆర్టీసీ బస్సు సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని, వెంటనే బస్సు సర్వీసుల సంఖ్య మెరుగు పరిచే విధంగా చూడాలని ప్రజా ప్రతినిధులు కోరారు. శుక్రవారం కొల్లూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వైస్ ఎంపీపీ మురాల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. బాపట్లకు వేమూరు నుంచి బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. తెనాలి బస్సు డిపో నుంచి గతంలో పలు గ్రామాలకు బస్సులు నడిచేవని, ప్రస్తుతం ఆ సర్వీసులను రద్దు చేయడం వల్ల విద్యార్థులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. తెనాలి నుంచి రాత్రి వేళల్లో కొల్లూరుకు నైట్ హాల్ట్ బస్సును ఏర్పాటు చేయడంతోపాటు, కొత్తూరులంకకు రెండో బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. తిప్పలకట్ట బస్సును గతంలో మాదిరిగా వయా దోనేపూడి మీదుగా నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పెసర్లంక వద్ద రహదారి అధ్వానంగా మారి, నీళ్లు నిలుస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని ఆక్రమణలు తొలగించాలని వివరించారు. గాజుల్లంక నుంచి కిష్కిందపాలెం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంబడి ఇటుక బట్టీల నిర్వాహకులు మట్టి తవ్వకాలు సాగించడం, రోడ్ల వరకు ఆక్రమణలు చేపట్టడం వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులు తొలగించాలని కోరారు. అనంతవరం సచివాలయ సర్వేయర్ కొలతలు చేపట్టేందుకు నగదు డిమాండ్ చేస్తున్నాడని తగిన చర్యలు చేపట్టాలని కోరారు. సభ్యుల సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని ఎంపీడీఓ సత్యనారాయణరావు తెలిపారు. ఈ సమావేశంలో , జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



కర్లపాలెం: పాత నందాయపాలెంలో అభయాంజనేయస్వామి విగ్రహం శనివారం ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. శుక్రవారం విష్వేశ్వర గవ్యాంతం, క్షీరాదివాసం, జలాదివాసం, వాస్తుపూజ, వాస్తు హోమం, వాస్తు బలి, పర్యాగ్నికరణం, ధాన్యాదివాసం, కలావాహన, కలాహోమంలు, పంచశయ్యాదివాసం, పుష్పాదివాసం, పూజలు నిర్వహించి హారతులిచ్చారు.పూజా కార్యక్రమాలలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందజేత



భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం 10 మంది జగనన్న కాలనీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.35 వేలు చొప్పన రూ 3.50 లక్షలు గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి చేతుల మీదగా అందచేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీం, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలను పరిరక్షించాలి

- పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి
- సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి
- కర్లపాలెం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ వకుల్ జిందాల్



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్

కర్లపాలెం: శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పరిరక్షించాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. శుక్రవారం కర్లపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. తొలుత స్టేషన్‌కు వచ్చిన ఎస్పీ వకుల్ జిందాల్‌కి డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ ఎం.శివయ్య స్వాగతం పలికారు. పోలీసుల నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ పరిసరాలను సందర్శించి, ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ పోలీస్ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం స్టేషన్‌లో పలు కేసులకు సంబంధించిన రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడారు. వార్షిక తనిఖీలో భాగంగా కర్లపాలెం పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించామన్నారు. గ్రామాలలో నేరాలను తెలుసుకుని నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. మహిళా పోలీసులు గ్రామాల్లో జరిగే ఘటనలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావటంతో పాటు ఒంటరి మహిళలకు రక్షణగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. కర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశామన్నారు. గ్రామాల్లో కొత్తగా వచ్చే వ్యక్తులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించామని తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్‌ను వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండలాధ్యక్షుడు, బాపట్ల ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతా రామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, స్వంచ్ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గుండ్రెడ్డి శివ, వైఎస్సార్ సీపీ యూత్ మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఆట్ల నాగేశ్వర రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి పూలబొకేలు అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, బాపట్ల రూరల్ సీఐ జి.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్‌రావు, సీసీ హరికృష్ణ, కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య, చందోలు ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

వైభవం చెన్నమల్లేశ్వరుని కల్యాణం



రేపల్లె రూరల్: పట్టణంలోని ఇసుకపల్లిలో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవారిని వధువరులుగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు సాయంత్రం సమయంలో ఎదురుకోలోత్సవం కోలాహలంగా నిర్వహించారు. మేళతాళాల నడుమ, వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రసవత్తరంగా వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ



క్రికెట్ బ్యాట్‌ను బహూకరిస్తున్న మేరుగ చందన్‌నాగ్

కొల్లూరు: వైఎస్సార్ స్మారక హార్డ్ టెన్నిస్ బాల్ సీజన్-2 క్రికెట్ టోర్నీ రసవత్తరంగా జరుగుతోంది. బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్ నాగ్ నేతృత్వంలో గత పది రోజుల నుంచి వేమూరు నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పోటీల్లో.. వివిధ జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. శుక్రవారం అద్దేపల్లి జట్టుపై వేమూరు జట్టు విజయం సాధించింది. పెదపూడి, వెల్లబాడు జట్ల నడుమ జరిగిన పోరులో పెదపూడి జట్టు గెలుపొందగా, మత్తిపాలెం జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఇంటూరు జూనియర్ ఏఎంటీ జట్టు విజయం సాధించింది. పెదపాలెం జట్టుపై ఆడిన వలివేరు జట్టు గెలుపొందగా, కారకర్లమూడి జట్టు పెదలంక జట్టుపై, చంపాడు జట్టుపై వెల్లటూరు పవర్ 11 జట్టు విజయం సాధించాయి. పోటీలలో రాణించిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులతోపాటు, ఓడిన జట్లకు క్రికెట్ బ్యాట్లను మేరుగ చందన్‌నాగ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కూచిపూడి మోషే, ఆళ్లమూడి మధు, కొల్లూరు శ్రీనివాసరావు, దోనే ప్రేమ్ చంద్‌లు పాల్గొన్నారు.

ప్రారంభమైన 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

రేపల్లె రూరల్: పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని మున్సిపల్ హైస్కూలు కేంద్రంలో పరీక్షకు 42 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 16 మంది గైర్హాజరయ్యారు. పేటేరు జడ్పీ హైస్కూలులో 102 మంది విద్యార్థులకు 24 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ నవీన్‌కుమార్ తెలిపారు.

4న ఏరువాక పౌర్ణమి పూజలు

వల్లభాపురం(కొల్లిపర): వల్లభాపురం గ్రామంలో వినాయకస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఏరువాక పౌర్ణమి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆయన ఆయన మాట్లాడారు. మరో 10 రోజులల్లో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తారని, కావున రైతాంగానికి మేలు జరిగేందుకు, అధిక దిగుబడులు సాధించాలని ఏరువాక పౌర్ణమి పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు పూజలో పాల్గొని, కార్యక్రమం జయప్రదం చేసి తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ, ప్రియాంక

మున్నంగి(కొల్లిపర): ప్రతి ఒక్కరూ తమ గృహాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ, నిత్యం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటం వల్ల దోమలు, ఈగలు అభివృద్ధి చెందకుండా అరికట్టవచ్చు అని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా మున్నంగి గ్రామంలో నీటి నిల్వలను పరిశీలించి, దోమల నిర్మూలనకు ఎబేట్ మందును మురుగు నీటిలో సిబ్బంది చేత పిచికారి చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు నీరు నిల్వలు ఉండటం వలన దోమల లార్వాలు అభివృద్ధి చెంది దోమలు అధికమవుతాయి అని తెలిపారు. తెనాలి ఇన్‌చార్జి మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి , సమాజ ఆరోగ్య అధికారిణి దాసర స్వరూపరాణి, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రుల ఆణిముత్యం దుగ్గిరాల



గోపాలకృష్ణయ్య విగ్రహానికి ఫోరం సభ్యుల నివాళి

బాపట్ల అర్బన్: చీరాల- పేరాల ఉద్యమానికి నాయకత్వం వహించడంతో జాతీయ స్థాయిలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆంధ్రుల సత్తా చాటారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు కొనియాడారు. గోపాలకృష్ణయ్య 135వ జయంతి సందర్భంగా శుక్రవారం ఫోరం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. సభ్యులు మాట్లాడుతూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి పదవిని చేపట్టిన తొలి ఆంధ్రుడు గోపాలకృష్ణయ్య అన్నారు. రామదండును ఏర్పాటు చేసి, ఎంతోమందిని స్వాతంత్రోద్యమంలో భాగస్వాములుగా చేసిన మహనీయుడని చెప్పారు. ఆయన చూపిన తెగువ, సాహసం అనితర సాధ్యమన్నారు. ఆయన నడయాడిన ప్రాంతానికి 'ఆంధ్ర రత్న ప్రాంగణం'గా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల నామకరణం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో జి.రవీందర్, ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయి బాబు, తహసీల్దారు సీహెచ్ సుధారాణి, యూవీ రామారావు, బండికళ్ల బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

బాపట్ల అర్బన్: బాపట్ల ఎస్ఎన్‌పీ అగ్రహారంలో వేంచేసి యున్న గంగా పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి దివ్య కల్యాణ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం ఉదయం 7 గంటలకు నిత్య హోమం, బలిహరణ, 7:30 గంటలకు స్వామికి మహన్యాస పూర్వక అష్టోత్తర శత కలశ విశేష అభిషేకం తదితర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు ప్రసాద్ స్వామి, చిట్టిబాబు, కౌండిన్య శర్మ, నాదెండ్ల విశ్వేశ్వర గురుకులు శివాచార్య యాజ్ఞీకంలో జరిగింది. ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ, ఆదూరి ఏడుకొండలు, కృష్ణభాస్కర్, నెమలికంటి హనుమంతరావు, బండి వెంకటరాంబాబు, నందీశ్వర భక్తబృందం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

ర్యాలీకి తరలిన భట్టిప్రోలు వాసులు



బైక్‌పై ర్యాలీ ప్రారంభం సందర్భంగా నినాదం

భట్టిప్రోలు: హిందూ సామ్రాజ్య దినోత్సవం పురస్కరించుకుని తెనాలిలో జరుగుతున్న బైక్ ర్యాలీకి భట్టిప్రోలు బౌద్ధస్థూపం ఎదుట ఉన్న విగ్రహాల సెంటర్ నుంచి శుక్రవారం స్థానికులు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ర్యాలీ కన్వీనర్ క్రాప రవికుమార్ మాట్లాడుతూ హిందువుల ఆత్మాభిమానాన్ని నిలబెట్టి, హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించి పట్టాభిషేకం జరిపిన రోజు హిందూ ఆత్మాభిమాన దివస్‌గా జరుపుకోవడం హిందువులందరి విధి అన్నారు. బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు ఛత్రపతి శివాజీ పట్టాభిషేక మహోత్సవం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జి. వెంకటేశ్వరరావు, బి. లక్ష్మీకాంతారావు, టి. శ్రీనివాసరావు, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, కె.ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ పట్టాభిషేక దినోత్సవం



శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బాపట్ల అర్బన్ : స్థానిక బీమావారి పాలెం పిల్లల పార్కులో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఛత్రపతి శివాజీ పట్టాభిషేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సమరసత ఫౌండేషన్ సభ్యురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ శివాజీ సాహస జీవితం, హిందువుల కోసం ఆయన చేసిన పోరాటం ఆదర్శనమన్నారు. తన దేశానికి నిస్వార్థ సేవ నేటి విశ్వగురుత్వానికి శివాజీ కారణమని వివరించారు. నేటి మహిళలు శివాజీ తల్లిని ఆదర్శంగా తీసుకొని పిల్లలకు రామాయణ, భారతం గురించి చెప్పి మంచి పౌరులుగా తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిల్లా సత్యనారాయణ, నరసింహారావు, సూరిబాబు, బాబురావు, బోలగాని వెంకటేశ్వరరావు, శైలజ, పద్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలేనికి నాలుగు ట్రాక్టర్లు



రైతులకు ట్రాక్టర్లు అందజేసిన ఏవో సుమంత్‌కుమార్

కర్లపాలెం: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏవో సుమంత్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన వైఎస్సార్ యంత్ర సేవ పథకంలో భాగంగా కర్లపాలెం మండలంలో సీహెచ్‌సీ గ్రూపుల రైతులకు ఏవో సుమంత్ కుమార్ శుక్రవారం ట్రాక్టర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కర్లపాలెం మండలంలోని మొత్తం 4 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లకు 4 ట్రాక్టర్లు ఇచ్చామని తెలిపారు. ఒక్కో ట్రాక్టరు ఖరీదు రూ.7.14లక్షలు కాగా దీనిలో 50 శాతం బ్యాంకు రుణం కాగా మరో 40 శాతం ప్రభుత్వ సబ్సిడీ పోను రైతు గ్రూపులు 10 శాతం చెల్లించారని తెలిపారు. సబ్సిడీ పోను బ్యాంకు రుణం ప్రతినెలా కొంత మొత్తంలో చెల్లించాల్సి ఉంటుందని ఏవో చెప్పారు. మండల పరిధిలోని యాజలి, పెదపులుగువారిపాలెం, ఏట్రవారిపాలెం, పేరలి గ్రామాలలోని రైతు గ్రూపులకు ట్రాక్టర్లు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఆరు ట్రాక్టర్లు పంపిణీ

నగరం: డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద మండలంలోని ఆరు కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ కింద రైతులకు రూ.55లక్షల విలువ చేసే ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను అందించినట్లు ఏఓ కె.రమేష్‌బాబు చెప్పారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)పరిధిలో ఐదుగురు రైతులతో గ్రూప్‌లగా ఏర్పాటుచేసి ట్రాక్టర్లు, వ్యసాయ పనిముట్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ యంత్రాలు, పరికరాలకు ప్రతి ఆర్బీకేకు రూ.15 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. రైతులు 10శాతం చెల్లిస్తే, 40 శాతం ప్రభుత్వం సబ్సిడీ, మిగిలిన 50శాతం లోన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఆరు కమ్యూనిటీ హైరింగ్ సెంటర్‌లకు ఆరు ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు అందించినట్లు వివరించారు.

మలేరియా వ్యాధిపై అవగాహన ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ దేవిక వాణి, సిబ్బంది

తెనాలిఅర్బన్: ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల మలేరియా వ్యాధి సోకుతుందని మారీసు పేటలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వాకాడ దేవికవాణి పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా మారీసుపేటలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియ ఒకరి నుంచి మరొకరికే సోకే అవకాశం ఉందన్నారు. దోమకాటుకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే వెంటనే సమీపంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాలని సూచించారు. తెనాలి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

వేమూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ వేసినట్లు ఎస్ఐ చోడయ్య శుక్రవారం తెలిపారు. కొల్లూరు నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టరును బస్టాండ్ సెంటరులో ఎస్ఈబీ పోలీసులు నిలుపుదల చేశారు. ప్రభుత్వ అనుమతి పత్రాలు చూపక పోవడంతో వాహనాన్ని వేమూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు.